# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-05-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **గిరిజనుల అభివృద్ధికి గత ప్రభుత్వాలకంటే అధికంగా నిధులు కేటాయించామని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.**

**2.** **ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలో సార్వత్రిక ఎన్నికల నాలుగవ దశ పోలింగ్ మరి కొద్ది సేపటిలో ప్రారంభమవుతుంది.**

**3.** **ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాలకు సంబంధించి పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్ కుమార్ మీనా వెల్లడించారు.**

**4.** **తెలంగాణ ఎంసెట్ 2024కి సంబంధించిన ప్రాథమిక కీ ని తెలంగాణ ఉన్నత విద్యా మండలి విడుదల చేసింది.**

**5.** **ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రాబోయే మూడు రోజుల్లో పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.**

=========================

గిరిజనుల అభివృద్ధికి గత ప్రభుత్వాలకంటే ఎన్నో రెట్లు ఎక్కువ నిధులు కేటాయించామని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. పశ్చిమ బెంగాల్‌లోని బరాక్‌పూర్‌లో నిన్న జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ, బెంగాల్ రాష్ట్రం ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్ పుట్టిన భూమి అని, నేడు తృణమూల్ కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ ఇక్కడ విచ్ఛిన్నమైందని విమర్శించారు.

-------------------------

దేశంలో సార్వత్రిక ఎన్నికల నాలుగవ దశ పోలింగ్ మరి కొద్ది సేపటిలో ప్రారంభమవుతుంది. దేశ వ్యాప్తంగా పది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలోని 96 లోక్ సభ స్థానాలకు పోలింగ్ జరుగుతుంది. ఉత్తరప్రదేశ్ లో 13, మహారాష్ట్రలో 11, మధ్యప్రదేశ్‌లో 6, పశ్చిమ బెంగాల్, బీహార్లో 5, ఒడిశాలో 4, ఝార్ఖండ్లో 4, జమ్ము కాశ్మీర్లో ఒక లోక్‌సభ స్థానానికి పోలింగ్ జరగనుంది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 25 లోక్ సభ స్థానాలు, 175 శాసన సభా స్థానాలకు, తెలంగాణా రాష్ట్రంలోని 17 లోక్ సభ స్థానాలకు కూడా పోలింగ్ ప్రారంభమవుతోంది. తెలంగాణా రాష్ట్రంలోని కంటోన్మెంట్ శాసన సభా స్థానానికి కూడా ఈ రోజే ఉప ఎన్నిక జరుగుతోంది. ఉభయ తెలుగు రాష్ట్రాలలో స్వేచ్ఛగా, ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు ఆయా రాష్ట్రాల ఎన్నికల సంఘాలు సర్వం

సిద్ధం చేశాయి. ఎన్నికల జరుగుతున్న అన్ని నియోజక వర్గాలకు, పోలింగ్ బూత్ లకు ఎన్నికల అధికారులు ఈవీయంలను తరలించి పోలింగ్ నిర్వహణ కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుంది. ఈనెల 20వ తేదీన ఐదో విడత, 25వ తేదీన ఆరో విడత ఎన్నికలు, జూన్ 1వ తేదీన చివరి విడత పోలింగ్ నిర్వహించనున్నారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అదేరోజున ఫలితాలు ప్రకటిస్తారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాలకు సంబంధించి పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్ కుమార్ మీనా వెల్లడించారు. ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, రీ-పోలింగ్ జరగకుండా శాంతియుతంగా ఎన్నికల నిర్వహణ చేపడతున్నామని పేర్కొన్నారు. వందశాతం పోలింగ్ జరిగేలా కృషి చేస్తున్నామన్నారు. సెంట్రల్ కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తామని తెలిపారు. సాంకేతికంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా పరిష్కరించేలా ఏర్పాట్లు చేశామని అన్నారు. వృద్ధులకు, దివ్యాంగులకు పోలింగ్ స్టేషన్లల్లో ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశామని ముఖేష్‌కుమార్ మీనా పేర్కొంటూ..

..వాయిస్.. 30 సెకన్లు

---------------------------

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆంధ్ర ప్రదేశ్ లో 169 స్థానాలలో సాయంకాలం ఆరు గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. కాగా పాలకొండ, కురుపాం, సాలూరు నియోజకవర్గాల్లో సాయంత్రం 5 గంటల వరకు, అరకు, పాడేరు, రంపచోడవరం నియోజక వర్గాలలో సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో 4 కోట్ల 14 లక్షల మంది ఓటర్ల కోసం మొత్తం 40 వేల 389 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 34 వేల 651 పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ చేశారు. వీటిలో పోలింగ్ కేంద్రం మొత్తాన్ని పరిశీలించేలా సి సి కెమరాలు ఏర్పాటు చేయడం విశేషం. 12 వేల 438 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ఇక ఆంధ్రప్రదేశ్‌లో 175 శానన సభా స్థానాలకు 2 వేల 387 మంది మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా, 25 లోక్ సభ స్థానాలకు 454 మంది అభ్యర్థులు పోటీలో వున్నారు. మరొక వైపు తెలంగాణా రాష్ట్రంలో 17 లోక్ సభ స్థానాలకు 625 మంది అభ్యర్థులు పోటీలో వున్నారు. రాష్ట్రంలో 3 కోట్ల 31 లక్షల మంది ఓటర్లు ఉండగా 35 వేల 809 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసారు. ఇలా ఉండగా తెలంగాణా రాష్ట్రంలోని 119 శాసన సభా నియోజక వర్గాలలో 106 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో ఉదయం 7 నుండి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. 13 సమస్యాత్మక నియోజక వర్గాలలో సాయంకాలం నాలుగు గంటలకే పోలింగ్ ముగుస్తుంది. ఈ సారి పోలింగ్ శాతం గణనీయంగా పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలు అనేక చర్యలు తీసుకున్నాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో ఈ రోజు జరుగుతున్న ఎన్నికల పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఉభయ రాష్ట్రాల ఎన్నికల సంఘాలు ఓటర్లకు సూచిస్తున్నాయి. రాజ్యాంగం కల్పించిన ఈ పవిత్రమైన హక్కును వినియోగించుకోవడం ప్రజలు తమ బాధ్యతగా భావించాలని పేర్కొన్నాయి. పోలింగ్ బూత్ లలో ఓటర్లు ఎటువంటి ఇబ్బందులకు గురి కాకుండా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపాయి.

ప్రపంచంలోనే జరుగుతున్న ఈ అతి పెద్ద ప్రజాస్వామ్య క్రతువులో ప్రతి ఒక్కరూ భాగం కావాలని ఎన్నికల సంఘాలు కోరాయి.

ఇలాఉండగా అందరూ ఓటు వేసి భారత ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని పలువురు ప్రముఖులు కూడా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

-----------------------------

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటు వేసేందుకు వెళ్ళే ప్రయాణికులతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలోని ప్రధాన రైల్వే స్టేషన్‌లు, బస్సు స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. హైదరాబాదులోని ఎం.జి.బి.ఎస్, జూబ్లి హిల్స్, మియా పూర్, ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి తదితర నగరాలలోని బస్సు స్టేషన్లు, రైల్వే స్టేషన్ లలో విపరీతమైన రద్దీ నెలకొంది. ఉభయ రాష్ట్రాల రోడ్డు రవాణా సంస్థలు అదనపు బస్సులు నడుపుతున్నప్పటికి ఆ బస్సులు సరిపోక ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా గమ్య స్థానాలకు చేరుకుంటున్నారు. ప్రత్యేకించి తెలంగాణా రాష్ట్రం నుండి ఆంధ్ర ప్రదేశ్ కు వచ్చే ప్రయాణికులతో హైదరాబాదు – విజయవాడ జాతీయ రహదారిలో టోల్ ప్లాజా ల వద్ద వాహనాలు బారులు తీరి వున్నాయి.

-----------------------------

తెలంగాణ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, మెడికల్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష –టీఎస్ ఎంసెట్ 2024 సంబంధించిన ప్రాథమిక కీ ని తెలంగాణ ఉన్నత విద్యా మండలి విడుదల చేసింది. సమాధానాల పత్రాన్ని సంబంధిత వెబ్ సైట్ ద్వారా డౌన్ లోడ్ చేసుకోవచ్చునని తెలిపింది.సమాధానాల కీ సంబంధించి ఏవైనా అభ్యంతరాలుంటే ఇంజనీరింగ్ విద్యార్థులు రేపటిలోగా తెలియజేయాలని పేర్కొంది. అగ్రికల్చర్, మెడికల్ విద్యార్థులు ఈరోజులోపు తెలియజేయాలని పేర్కొంది.

-----------------------------

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రాబోయే మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో ఈ రోజు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. పల్నాడు, నంద్యాల, ప్రకాశం, కర్నూలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది.

తెలంగాణ వ్యాప్తంగా ఈరోజు ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ పేర్కొంది. ఈ మేరకు 'పసుపు' రంగు హెచ్చరికలు జారీ చేసింది. వాతావరణ శాఖ సూచనల మేరకు ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో అధికారులు జాగ్రత్తలు చేపడుతున్నారు.

-----------------------------

రాష్ట్రంలో శాసనసభతో పాటు లోక్ సభకు ఈరోజు జరగనున్న ఎన్నికల నేపథ్యంలో అర్హత వున్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం సూచిస్తోంది. ఓటరుగా అర్హత పొంది ఓటరు గుర్తింపు కార్డు లేని వారు అందుకు ప్రత్యామ్నాయంగా ఆధార్ కార్డు, పాన్ కార్డు వంటి 12 గుర్తింపు కార్డులలో

ఏదో ఒకటి చూపించి ఓటు వేయవచ్చునని తెలిపింది. ఓటరు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి అధికారుల వద్ద ఓటు వివరాలు సరిచూసుకున్న తరువాత బ్యాలెట్ యూనిట్ వద్దకు వెళ్ళాలి. బ్యాలెట్ పత్రంపై ఓటు వేయాలని నిర్ణయించుకున్న అభ్యర్థి పేరు వద్ద వున్న మీటను నొక్కాలి. ఈ మీటను నొక్కిన వెంటనే పక్కనే వున్న బాణం గుర్తులో ఎరుపు రంగు లైటు వెలిగి బీప్ శబ్దం వచ్చి వీవీప్యాట్‌లో ఓటు వేసిన అభ్యర్థి పేరు, పార్టీ గుర్తు వివరాలతో ఉన్నచీటీ ఏడు క్షణాల పాటు మాత్రమే కనిపించి వీవీప్యాట్ యంత్రంలో పడిపోతుంది. ఆ సమయంలో ఆ చీటీని ఓటరు పరిశీలించి తాము వేసిన ఓటు సక్రమంగా పోలైందీ, లేనిదీ నిర్ధారించు కోవచ్చని తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలో లోక్ సభ, శాసన సభలకు ఏక కాలంలో ఎన్నికలు జరుగుతున్నందున రెండు బ్యాలెట్ యూనిట్లలో అభ్యర్థులకు వేర్వేరుగా ఇదే విధానంలో ఓటు వేయవలసి వుంటుందని పేర్కొంది.

=======================